పండగ పూట..ధరల మంట

- పామాయిల్ లీటరు రూ.140
- కొబ్బరి కేజీ రూ.200
- కిలో తెల్లవాయిల ధర రూ.300 - రూ.350
- అవస్థలు పడుతున్న సామాన్య ప్రజలు

మార్కెట్లో వంట సరుకుల ధరలు ఈ విధంగా ఉన్నాయి

వంట సరుకు పేరు	కిలో ధర
కొబ్బరి	రూ.200
ఎండు మిర్చి	రూ.250
బెల్లం	రూ.52
చక్కెర	రూ.44
తెల్లవాయిలు	రూ.300-రూ.350
ఓలిగ రవ్వ	రూ.60
పప్పులు	రూ.120
శెనగ బేడలు	రూ.110
కంది బేడలు	రూ.160- రూ.170
కారం పొడి	రూ.250
పసుపు పొడి	రూ. 250
ధనియాల పొడి	రూ.200
పామాయిల్(లీటరు)	రూ.130
చింతపండు	రూ.160
ఉద్దిబేడలు	రూ.140
గోధుమ పిండి	రూ.40 నుంచి రూ.50
పెసర బేడలు	రూ.150
ఉల్లిగడ్డ	రూ.60
బియ్యం	రూ.50 నుంచి రూ. 60



అమ్మకానికి ఉంచిన నిత్యావసర సరుకులు

కూడేరు: అన్ని వర్గాల ప్రజలు ఆనందంగా జరుపుకునే దసరా పండుగ దగ్గర పడుతోంది. పండుగకు సరుకులు కొందామని మార్కెట్‌కు వెళ్తే ధరలు చూసి సామాన్యుల గుండె దడపుడుతోంది. మార్కెట్లో నెల రోజుల నుంచి నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ వస్తున్నాయి. దసరా పండుగ సమీపిస్తుండడంతో ధరలు రెట్టింపయ్యాయి. రెండు నెలల క్రితం వరకు కూరగాయల ధరలు కొని,తినలేని పరిస్థితి ఉండేది. వాటి ధరలు తగ్గుముఖం పట్టాయి. దీంతో సామాన్యులకు కాస్త ఊరట లభించిందనుకునే లోపు వంట సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మార్కెట్‌లో రూ.100 ఉన్న లీటరు పామాయిల్ రూ.140కి పెరిగింది. రూ.150 ఉన్న తెల్లవాయిల ధల రూ.300 నుంచి రూ.350 వరకు పెరిగింది. కొబ్బరి కేజీ రూ.200కు చేరింది. శనిగ బేడలు కేజీ రూ.110 పలుకుతుంటే టమాట ధరలు పెరిగిపోయాయి. ఇలా వంట సరుకుల ధరలు పెరగడంతో పేదలు అవస్థలు పడుతున్నారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు వంట సరుకులను కొనలేక వాడకాన్ని తగ్గించేశారు. కేజీ కొనుగోలు చేసేవారు కాల్ లేదా అర కేజీ కొనుగోలు చేస్తూ పూట గడుపుకుంటున్నారు. పండగ పూట ఏం కొనాలో ఏం తినాలో అర్థంకాని పరిస్థితిలో ఉన్నారు. మరోవైపు వ్యాపారాలు తగ్గిపోవడంతో దుకాణదారులు ఇబ్బంది పడుతున్నారు. పెట్టుబడి పెరిగిపోతోందిగానీ లాభం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న నిత్యావసర సరకుల ధరలను నియంత్రించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

లాభాలు తగ్గి పోయాయి



వంట సరుకుల ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చు పెరిగిపోతోంది. కానీ పెరిగిన రేట్లకు తగ్గట్టు లాభం లేదు. రేట్లు ఉన్నాయని ప్రజలు ఎక్కువగా వంట సరుకులు కొనడం లేదు. దీంతో వ్యాపారాలు తగ్గాయి. లాభాలు అంతంత మాత్రమే. ఏమి చేయాలో దిక్కు తోచడం లేదు. ఇలానే కొనసాగితే ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుంది. – శ్రీధర్ బాబు, కిరాణా దుకాణదారుడు, కూడేరు

కొనలేని పరిస్థితి



కూలి పనులకు వెళ్లి వచ్చే డబ్బుతో జీవనం సాగిస్తున్నాం. మార్కెట్లో కూరగాయల ధరలు తగ్గాయిలే అనుకొని ఊపిరి పీల్చుకునే లోపే మరో పక్క నిత్యావసర వంట సరుకుల ధరలు విపరీతంగా పెరిగి పోతున్నాయి. పండగ పూట ఏం కొనాలో.. ఏం తినాలో అర్థంకాని పరిస్థితి. పెరిగి పోతున్న వంట సరకుల ధరలను ప్రభుత్వం తగ్గించాలి. – లక్ష్మీదేవి, వ్యవసాయ కూలీ, గొటుకూరు, కూడేరు మండలం

క్లుప్తంగా

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



క్యాడెట్లకు డ్రిల్‌పై శిక్షణ ఇస్తున్న ఎన్‌సీసీ అధికారులు

కూడేరు: ఎన్‌సీసీ క్యాడెట్లు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎన్‌సీసీ క్యాంప్ కమాండర్ కల్నల్ ఎల్‌డీ రోడ్రిక్స్ సూచించారు. బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఎన్‌సీసీ నగర్‌లో కొనసాగుతున్న సీఏటీసీ–7వ ఎన్‌సీసీ శిక్షణా తరగతులు ఆదివారం ముగిశాయి. చివరి రోజు క్యాడెట్లకు డ్రిల్, మార్చ్‌పాస్ట్, వ్యాయామంపై ఎన్‌సీసీ అధికారులు శిక్షణ ఇచ్చారు. క్యాంప్ కమాండర్ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించడానికి వీలుంటుందన్నారు. రోజూ వ్యాయామం, వాకింగ్, డ్రిల్ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ డిప్యూటీ కమాండర్ కల్నల్ కులకర్ణి, ఎన్‌సీసీ అధికారులు, వివిధ జిల్లాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

టమాట మొక్కలకు డిమాండ్



నర్సరీలో టమాట మొక్కలను పెంచుతున్న దృశ్యం

కూడేరు: మార్కెట్లో టమాటా ధర పెరుగుతుండడంతో పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. నర్సరీల్లో టమాట మొక్కలకు డిమాండ్ పెరుగుతోంది. ఇప్పటికే మండలంలో సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో రైతులు టమాట పంట సాగు చేసి ఉంటారు. డిమాండ్ లేని సమయంలో టమాట మొక్క నాణ్యతను బట్టి 20పై నుంచి 50పై వరకు ధర ఉంటుంది. నెలన్నర క్రితం వరకు టమాట నాణ్యతను బట్టి కేజీ రూ.40 నుంచి 80 వరకు పలికింది. క్రమేనా మార్కెట్లో టమాట ధర తగ్గుముఖం పడుతూ వచ్చింది. దీంతో టమాట సాగుకు రైతులు ఆసక్తి చూపలేదు. నర్సరీ నిర్వాహకులు టమాట మొక్కల సాగును ఎక్కువ మొత్తంలో సాగు చేయలేదు. ప్రస్తుతం ఉన్నట్టుండి టమాటకు డిమాండ్ ఉండడంతో టమాట మొక్క 70 పైసల వరకు పలుకుతోంది. అయినా టమాట మొక్కలు రైతులకు లభించడం లేదు. తమకు ఇన్ని మొక్కలు కావాలంటూ రైతులు ఆర్డర్లు ఇస్తున్నారు.

నేడు సీపీఐ పల్లె నిద్ర

కూడేరు: ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం రాత్రి పి.నారాయణపురంలో సీపీఐ ఆధ్వర్యంలో 'పల్లె నిద్ర' నిర్వహిస్తున్నట్లు తాలుకా కార్యదర్శి మల్లికార్జున ఆదివారం తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, ఇతర జిల్లా, మండల నేతలు హాజరవుతారన్నారు.

దశభుజ మహా గణపతికి పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం గ్రీన్‌కో ఫౌండేషన్ – సాండ్లా విండ్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య, కంటి వైద్య శిబిరాన్ని సర్పంచు మల్లెల జగదీష్ ఏర్పాటు చేశారు. అనంతరం జరిగిన వైద్యశిబిరంలో కంటి పరీక్షలతోపాటు రక్తపరీక్షలు చేశారు. మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు భవ్య, జాన్ క్రిస్టఫర్, సీఎస్ఆర్ జోనల్ కోఆర్డినేటర్ వేణుప్రసాద్, సైట్ ఇన్‌చార్జ్ జితేందర్, గ్రీన్‌కో ప్రతినిధి రామకృష్ణ, ఆశాకార్యకర్తలు లింగమ్మ, ధనలక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం శ్రమిద్దాం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాయదుర్గంటౌన్: ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ నారాయణ తెలిపారు. ఆదివారం మండలంలోని ఆయతపల్లిలో కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యపరిచారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



కేపీదొడ్డిలో శ్రీకాంత్ మృతదేహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని కేపీ దొడ్డిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు కుటుంబానికి నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి ఆదివారం పరామర్శించారు. నాగరాజు కుమారుడు శ్రీకాంత్ అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మెట్టుగోవిందరెడ్డి గ్రామానికి చేరుకొని శ్రీకాంత్ మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీ మండల కన్వీనర్ గౌని లక్ష్మీకాంతారెడ్డి, సర్పంచ్ రమేష్, నాయకులు కొత్తపల్లి సత్యనారాయణరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



చెక్కును కేరళ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడికి అందిస్తున్న లెనిన్ బాబు

కుందుర్పి: కేరళలోని వయనాడ్ వరద బాధితులకు సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కుందుర్పి విలువల బడుల విద్యార్థుల నుంచి సేకరించిన రూ.17వేల చెక్కును ఆ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వీకే రామచంద్రన్‌కు ఆదివారం అందజేసినట్లు ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు తెలిపారు. అంతకు ముందు ట్రస్టు తరపున మరో రూ.50 వేలు విజయవాడ వరద బాధితులకు అందించామన్నారు.

మూలనపడిన మినీ జేసీబీ



మూలన పడిన మినీ జేసీబీ

రాయదుర్గంటౌన్: అధికారుల నిర్లక్ష్యంతో రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలు కొద్ది రోజులకే మూలనపడుతున్నాయి. మున్సిపాలిటీకి చెందిన మినీ జేసీబీ చిన్నపాటి మరమ్మతు కూడా చేయించకపోవడంతో నిరుపయోగంగా ఉంది. స్వచ్ఛభారత్ కింద పారిశుధ్య నిర్వహణకు బ్యాక్ హోల్ లోడర్, మినీ జేసీబీని కొనుగోలు చేశారు. తరుచూ మరమ్మతులకు గురవుతుండడంతో ఎవరూ పట్టించుకోలేదు. మురుగు గుంతలు, ముళ్ల కంపలు తొలగించేందుకు, చిన్నపాటి చెత్తసేకరణకు మిజీజేసీబీని వినియోగించాల్సి ఉంది.

దెబ్బతిన్న కల్వర్టు



కల్వర్టుపై పడిన పెద్ద రంధ్రం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామం నుంచి తిమ్మలాపురం, నాగలాపురం గ్రామాల మీదుగా డి.హీరేహాళ్‌కు వెళ్లే మార్గంలో కల్వర్టుపై పెద్ద రంధ్రం పడి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. కల్వర్టు దెబ్బతిని ఏడాదయినా పట్టించుకునే నాథుడే లేడు. ఈ రోడ్డు ఉద్దేహాళ్ నుంచి 10 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కల్వర్టుకు రంధ్రం పడటంతో వాహనాలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు అంటున్నారు. దీనిపై పీఆర్ ఏఈఈ జగదీష్‌ని అడగ్గా, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రాయదుర్గంటౌన్: పట్టణ శివారు ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై రాయదుర్గం పోలీసులు ఆదివారం దాడి చేశారు. అర్బన్ సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో చేసిన దాడుల్లో ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.15 వేల నగదు, ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

ఇదేనా.. స్వచ్ఛతా హీ సేవ?



రాయదుర్గం 17వ వార్డులో నివాసాల మధ్య చెరువును తలపిస్తున్న మురుగు గుంట



బాలికోన్నత పాఠశాల వెనుక రోడ్డుపైనే చెత్త

రాయదుర్గంటౌన్: స్వచ్ఛతా హీ సేవ..స్వభావ్ స్వచ్ఛత–సంస్కార్ స్వచ్ఛత క్లీన్ ఆంధ్రప్రదేశ్ పేరిట పరిశుభ్రతపై ప్రభుత్వం, అధికారులు ఊరూరా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రజలను చైతన్యం చేసేందుకు ర్యాలీలు, మానవహారాలు ఏర్పాటు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో మాత్రం ఆచరణకు నోచుకోలేదు. రాయదుర్గం పట్టణంలోని అనేక కాలనీల్లో, మురుగువాడలు, శివారు కాలనీల్లో అపరిశభ్రత తాండవిస్తోంది. డ్రైనేజీ నీరు ముందుకు సాగక ఖాళీ స్థలాల్లో మురుగు పేరుకుపోయి చెరువులను తలపిస్తున్నాయి. జనావాసాల మధ్య ఉండడంతో రోగాల బారిన పడుతున్నారు. ప్రతి వార్డుల్లోనూ ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లకంపలతో దోమల బెడద అధికంగా ఉంది. పందులకు ఆవాసంగా మారి దుర్వాసన వస్తోంది. అనేక కాలనీల్లో డ్రైనేజీలు పూడి పోయి రోడ్లపైకి మురుగునీరు పారుతోంది. చెత్త సేకరణ కూడా సక్రమంగా జరగలేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అపరిశుభ్రత తాండవం

బ్రహ్మసముద్రం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఓ వైపు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛతా హీ సేవ అంటూ కార్యక్రమాలు చేపడుతూ ఫొటోలకు ఫోజులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం అపరిశుభ్రత తాండవిస్తోంది. మండలంలోని పేపులపర్తి, నాగిరెడ్డిపల్లి, భైరసముద్రం, బ్రహ్మసముద్రం, ఎరడికెర, కన్నేపల్లి తదితర గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం లోపించింది. దీంతో దోమలు ప్రబలి ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. అపరిశుభ్రత తొలగింపునకు చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోలేదని చెత్త, మురుగునీరు రోడ్లపై నిలిచిపోతోంది. పలు గ్రామాల్లో డ్రైనేజీలు సరిగా లేక మురుగునీరు రోడ్లపై పారుతోంది.



మధు థియేటర్‌కు వెళ్లే దారిలో ఇలా..



నాగిరెడ్డిపల్లిలో రోడ్డుపైనే నిలిచిన మురుగు నీరు



14వ వార్డు డ్రైవర్స్ కాలనీలో చెత్తాచెదారంతో పూడిపోయిన డ్రైనేజీ

బీటీపీకి కృష్ణా జలాలు అందించాలి



బీటీపీని పరిశీలిస్తున్న సీపీఐ బృందం

గుమ్మఘట్ట: బీటీపీకి కృష్ణాజలాలు అందించాలని ప్రభుత్వాన్ని సీపీఐ నేత జాఫర్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు మండలంలోని బీటీపీని సందర్శించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో 12 వేల ఎకరాల ఆయకట్టు ఉన్న భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తీసుకువస్తామని కూటమి నేతలు గతంలో అబద్ధపు హామీలు ఇచ్చి, ఆచరణలో పట్టించుకోలేదన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కళ్యాణదుర్గంలో 110 చెరువులు నింపి బ్రాంచ్ కెనాల్ ద్వారా బీటీపీకి నీరు అందించాలని కోరారు.74 ఏళ్ల క్రితం క్రితం నిర్మించిన తుంగభద్ర డ్యాం గేట్లను మార్చాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు , ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాలు ఉధృతంగా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి నాగార్జున, ఏఐవైఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, రైతు సంఘం తాలుకా కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామి, మండల కార్యదర్శి దుర్గన్న, నాయకులు వసికేరి రామాంజి, మల్లన్న, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసం చేసిన కూటమి ప్రభుత్వం



కళ్యాణదుర్గంలో సమ్మె చేస్తున్న శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా కార్మికులు

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని శ్రీరామరెడ్డి తాగునీటి సరఫరా చేసే కార్మికులు మండిపడుతున్నారు. ఆదివారం పట్టణంలో వారు సమ్మె చేశారు. తాగునీటి సరఫరా కార్మికులు మాట్లాడుతూ గతంలో 13 రోజులు సమ్మె చేయగా, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ స్పందించి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మె విరమించినట్లు తెలిపారు. నేటి వరకు పెండింగ్‌లో ఉన్న జీతాలు వేయకుండా ఒకనెల జీతాలను మాత్రమే చెల్లించి, అది కూడా కాంట్రాక్టర్ కొందరికి వేశాడని రూ.4,500 తక్కువగా జీతాలు చెల్లిచారన్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలు తీరుస్తామని హామీ ఇచ్చారని, పట్టించుకోలేదని కార్మికులు మండిపడ్డారు. ఆదివారం ఉదయం కార్మికులు సమ్మెకు దిగడంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది.

ఆముదం పంటకు తెగుళ్లు



గురువేపల్లి సమీపంలో పచ్చపురుగు ఆశించిన ఆముదం పంట

కుందుర్పి: కళ్యాణదుర్గం డివిజన్ వ్యాప్తంగా జూలైలో సాగుచేసిన ఆముదం పంటకు తెగుళ్ల సోకాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పచ్చపురుగు, నల్లచీడ తెగులుతో ఆముదం మొక్కలు మోడుబారినట్లు రైతులు ఓబుళపతి, గోపాల్, పాతన్న, కెంచప్ప తదితరులు తెలిపారు. జూలైలో కళ్యాణదుర్గం మండలంలో 2 వేలు ఎకరాలు, శెట్టూరు మండలంలో 650 ఎకరాలు, కంబదూరులో 1,240 ఎకరాలు, బ్రహ్మసముద్రంలో 1,120 ఎకరాలు, కుందుర్పిలో 469 ఎకరాలు ఆముదం పంట సాగైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. ఏఓ మహేష్ మాట్లాడుతూ పచ్చపురుగు తొలిదశలో ఉన్నప్పుడు నివారణకు బీటీ 400 గ్రాములు లేదా వేపనూనె ఒక లీటరు పిచికారీ చేయాలన్నారు. అలాగే పురుగు పెద్దవిగా ఉంటే బెంజోయేట్ 100 గ్రాములు, లేదా కోరాజాన్ 80 ఎంఎల్ ఎకరాకు 2 వందల లీటర్ల నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

అప్పుల బాధతో ఆగిన రైతు గుండె



రైతు కురుబ రాజశేఖర్ (ఫైల్)

వజ్రకరూరు: మండలంలోని రాగులపాడుకు చెందిన రైతు కురుబ రాజశేఖర్ (48) గుండెపోటుతో ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన మేరకు.. కురుబ రాజశేఖర్ తనకున్న తొమ్మిదెకరాల పొలంలో ఆరెకరాల్లో రెండేళ్లుగా మిరప పంట సాగు చేస్తున్నాడు. పంట ఆశాజనకంగా ఉన్నా ధరలేక తీవ్రంగా నష్టపోయాడు. దీంతో పెట్టుబడి కూడా దక్కలేదు. దీనికితోడు కుమార్తె వివాహానికి, పంట పెట్టుబడికి చేసిన అప్పు సుమారు రూ.25 లక్షల వరకు చేరింది. వ్యవసాయం లాభసాటిగా లేక, అప్పు తీర్చే మార్గంలేక తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. ఆదివారం సాయంత్రం గుండెపోటు వచ్చి మృతిచెందాడు. మృతుడు రాజశేఖర్‌కు భార్య లక్ష్మీదేవి, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం వీధి పడింది.

ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా మల్లికార్జున



కావలి మల్లికార్జున

వజ్రకరూరు: గుంతకల్లు రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటి సభ్యుడిగా వజ్రకరూరు మండలం పందికుంటకు చెందిన కావలి మల్లికార్జున ఎంపికయ్యాడు. ఈ మేరకు గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వై.భూషణం చేతుల మీదుగా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఉత్తర్వులు అందుకున్నారు. ఆర్టీఐలో అందిస్తున్న సేవలను గుర్తించి ఎస్‌జీఓ తరపున ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపిక చేసినట్లు మల్లికార్జున తెలిపారు.


కురుబలు అన్ని రంగాల్లో రాణించాలి



సమావేశంలో పాల్గొన్న కురుబ సంఘం నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: కురుబలు అన్ని రంగాల్లో రాణించాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు తెలిపారు. ఆదివారం పట్టణంలోని లింగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో కురుబల నియోజవర్గం స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం కళ్యాణదుర్గం మండల యువజన కురుబ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ నవంబర్ 18న అనంతపురంలో నిర్వహించనున్న కనదాస జయంత్యువాలను పెద్ద ఎత్తున నిర్వహించాలని కురుబ సంఘం నాయకులకు పిలునిచ్చారు.

ఆవులదట్లలో పోలీసుల కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ జయానాయక్

రాయదుర్గంటౌన్: మండలంలోని ఆవులదట్లలో అర్బన్ సీఐ జయానాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు సోదాలు చేసినట్లు సీఐ తెలిపారు. కర్ణాటక మద్యం, మట్కా, జూదం, రికార్డులు లేని వాహనాలు తనిఖీ చేసి, అనుమానిత వ్యక్తుల పై ఆరాతీశారు. పశువుల పాకలు, గడ్డివాములు తదితర ప్రదేశాల్లో తనిఖీ చేశారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, మత్తు,మాదక పదార్థాలు, మహిళలు, బాలికల పట్ల వేధింపులు, చీటింగ్ కేసులు అంశాలపై అవగాహన కల్పించారు.

నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో నీలగిరిస్వామి

వజ్రకరూరు: స్థానిక కురుబవీధిలో భక్తుల కొంగు బంగారం నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహామంగళ హారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు చేశారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.